

బడ్జెట్‌పై ఆశలు

- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇప్పటికే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్
- తుమ్మిళ్ల, గట్టు, పాలమూరు- రంగారెడ్డికి నిధులకు డిమాండ్
- కొత్త మెడికల్ కాలేజీల్లో వసతుల కల్పన, ప్రారంభంపై విన్నపాలు
- పెండింగ్‌లో ఉన్న నిధుల కోసం ప్రయత్నించనున్న ఎమ్మెల్యేలు



అసెంబ్లీ సమావేశ భవనం



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న ఉదండాపూర్ రిజర్వాయర్(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు శనివారం తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. ఈ బడ్జెట్‌పై భారీ ఆశలు ఉన్నప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు అనుగుణంగానే వ్యవహరించాల్సి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి కావడం, ఈ ప్రాంత వెనుకబాటు, కావాల్సిన అభివృద్ధి పనులు, సాగునీటి రంగంపై అవగాహన ఉండటంతో బడ్జెట్‌లో పెద్దపీట వేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే ఇప్పటికే పలు సమస్యలు, పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాల మంజూరు కోసం ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సీఎంను కలిసి ప్రత్యేకంగా విన్నవించగా.. వాటికి కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యం లభిస్తుందని భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే.. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 14 ద్వారా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం రూ.2,945 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దాదాపు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్య కావడం, అత్యంత దుర్భిక్ష ప్రాంతాలుగా పేరు ఉన్న నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును రూపొందించడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మక్తల్ నియోజకవర్గంలో భీమా ఫేజ్ 2లో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు సుమారు రూ.30 కోట్ల మేర పరిహారం పెండింగ్‌లో ఉంది. ఆ పరిహారం ఇవ్వకుండా గత ప్రభుత్వం జాప్యం చేసింది. ఇటీవల అక్కడి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి త్వరలో పరిహారం మంజూరవుతుందని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు కావాలని కోరుతున్నారు. ఇవే కాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలో బడ్జెట్‌పై భారీ ఆశలు ఉన్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

ప్రాజెక్టులకు నిధులపై ఆశలు..

ఇప్పటికే పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, మిగిలిన ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పలువురు ఎమ్మెల్యేలు కోరుతున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ఎన్నికల ముందు మంజూరైన వట్టెం కెనాల్ 1, 2, కరివెన రీచ్ 1, 2, ఉద్దండాపూర్ ఎడమ, కుడి కాలువలు, ఒకటి నుంచి ఐదు వరకు ప్యాకేజీలకు సంబంధించిన రూ.6,655 కోట్ల పనులను రద్దు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఆ పనులకు సంబంధించి కమీషన్లు చేతులు మారినట్లు నిర్ధారణకు వచ్చింది. ఉమ్మడి పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో 12.50 లక్షల ఎకరాల ఆయకట్టు, వేల గ్రామాలకు తాగు నీరు కోసం చేపట్టిన పీఆర్ఎల్ఐ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే గద్వాల జిల్లాలోని ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఈ పథకంలో భాగంగా మూడు పంపులు బిగించినప్పటికీ.. అందులో ఒక పంపు మాత్రమే పని చేస్తోంది. మరో రెండు పంపులూ పని చేసేలా డెలివరీ సిస్టర్న్ లేకపోవడంతో ఒకటే పంపును నడిపిస్తున్నారు. నికర జలాల కోల్పోయి.. వరద జలాల ఆధారంగా తుమ్మిళ్ల లిఫ్టును నడిపిస్తుండగా.. వరద వచ్చినప్పుడు స్టోర్ చేసుకునేందుకు వీలుగా మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు వద్ద మూడు రిజర్వాయర్లు నిర్మించాలని పథకంలో పేర్కొన్నారు. కానీ 2018లో ఈ పథకం ప్రారంభమైనా నేటికీ రిజర్వాయర్లను నిర్మించ లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ ప్రాంతానికి పుష్కలంగా సాగునీరు అందాలంటే ఈ మూడు రిజర్వాయర్లు నిర్మించాల్సిన అనివార్యత ఉంది. దీంతోపాటు గట్టు ఎత్తిపోతల పథకం పేరుకు పలుమార్లు శంకుస్థాపనలు జరిగినప్పటికీ.. ఇప్పటివరకు పనులు పూర్తి కావడం లేదు. నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు మూడు నుంచి నాలుగుసార్లు శంకుస్థాపనలు జరిగాయని చెప్పొచ్చు. అలాగే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కూడా ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తారని ఆశలు ఉన్నాయి. ఇవి కాకుండా వనపర్తి జిల్లాలో కర్నె తండా ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంది.

పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులు..

గత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించింది. కానీ నిధులను విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్య గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉంది. ఒక్క వనపర్తి జిల్లా పరిధిలోనే సుమారు రూ. 250 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నాగర్‌కర్నూల్, వనపర్తి మెడికల్ కాలేజీలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నారు. వాటికి ఇప్పటివరకు నయా పైసా మంజూరు చేయలేదు. ఒక్క వనపర్తి మెడికల్ కాలేజీ కాంట్రాక్టర్‌కే రూ.64 కోట్ల బిల్లు రావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం నిర్మాణం ఆగిపోతే మూడో సంవత్సరం తరగతులకు అనుమతులు వచ్చే అవకాశం లేకపోవడంతో అలాగే నిర్మిస్తున్నారు. ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరు కాకపోతే పనులు నిలిపేసే అవకాశం ఉంది. అలాగే పలు ఎత్తిపోతల పథకాలు, రోడ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, మన ఊరు- మనబడి కార్యక్రమంలో పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటికి ఒక పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. అలాగే కొత్తగా జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు మెడికల్ కాలేజీలు ఎన్నికల ముందు మంజూరు కాగా.. వాటికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. 100 ఎంబీబీఎస్ సీట్లను ఇస్తారని జీవోలో పెట్టగా.. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ గత ప్రభుత్వం 50 సీట్ల కోసమే ఎన్ఎంసీకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌లో కొత్త మెడికల్ కాలేజీల విషయంలో స్పష్టత రానుంది. కొడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించగా.. దానిపై కూడా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

పేట-కొడంగల్ ప్రాజెక్టుకు రూ.2,945 కోట్లు

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్: దశాబ్ద కాలంగా ఊరిస్తున్న నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టుకు ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో 14 విడుదలతో పాటు రూ.2,945 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా పాలమూరు ప్రజల పక్షాన రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి వంశీచంద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 69 జీవోను దశాబ్ద కాలంగా తొక్కిపెట్టి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. నాడు కాంగ్రెస్ ముఖ్యమంత్రి జలయజ్ఞం పేరుతో జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు చేపట్టగా, ప్రస్తుత ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తూ మరో జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును బొంద పెట్టి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తెచ్చిందన్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో 80 శాతం డ్రాచేసి, ఎకరా పొలానికీ నీరివ్వలేదని ఆరోపించారు. ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేసేందుకే ప్రాజెక్టు టెండర్లు రద్దు చేశారన్నారు. కృష్ణానది జలాల్లో తెలంగాణకు 570 టీఎంసీల నీటి వాటా రావాలని, కేసీఆర్ మాత్రం 299 టీఎంసీలకు ఒప్పుకోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు జహీర్‌అక్తర్, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబ, బెక్కరి అనిత పాల్గొన్నారు.

34,15,190

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల సంఖ్య ఇది

- జాబితా విడుదల
- మహిళా ఓటర్లు 17,18,987.. పురుష ఓటర్లు 16,96,114
- పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే 22,873 మంది అధికం
- పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న యంత్రాంగం



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9: మరి కొద్ది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించి నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ల పరిధిలో గల 14 నియోజకవర్గాల్లో 34,15,190 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితాను రెడీ చేసిన యంత్రాంగం టెక్నికల్‌గా ఎక్కడైనా తప్పులు దొర్లితే సరి చేసేందుకు బీఎల్‌వోలను డోర్ టూ డోర్ తిప్పి సరిచేసే చర్యలు చేపడుతోంది. కొన్ని ప్రాంతాలలో ఓటర్ల జాబితాలో వయస్సులో పొరపాట్లు జరగడం, కొందరి ఏజ్ 123 ఏళ్లుగా ప్రింట్ కావడంతో యంత్రాంగం సరి చేసే పనిలో పడింది. ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్లమెంట్‌ల పరిధిలో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లు, ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	272	1,28,268	1,30,377	13	2,58,658
జడ్చర్ల	274	1,11,354	1,11,863	05	2,23,222
దేవరకద్ర	289	1,18,372	1,20,705	–	2,39,077
మక్తల్	284	1,19,474	1,23,863	01	2,43,338
నారాయణపేట	270	1,16,261	1,19,254	02	2,35,517
కొడంగల్	275	1,19,237	1,23,020	10	2,42,267
షాద్‌నగర్	252	1,19,114	1,19,211	13	2,38,338
నాగర్‌కర్నూల్	259	1,18,764	1,19,366	03	2,38,133
కొల్లాపూర్	269	1,20,511	1,17,943	05	2,38,459
అచ్చంపేట	265	1,23,234	1,24,382	05	2,47,621
కల్వకుర్తి	262	1,22,805	1,20,148	09	2,42,962
వనపర్తి	296	1,35,367	1,37,282	04	2,72,653
గద్వాల	303	1,25,356	1,30,499	11	2,55,866
అలంపూర్	290	1,17,997	1,21,074	08	2,39,079
మొత్తం	3860	16,96,114	17,18,987	89	34,15,190

మహిళా ఓటర్లే అధికం

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ల పరిధిలోని 14 నియోజకవర్గాలలో 34,15,190 మంది ఓటర్లు ఉండగా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,80,417 మంది, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,34,773 మంది ఓటర్లు ఉన్నారు. ఈ రెండు పార్లమెంట్‌ల పరిధిలో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 22,873 మంది అధికంగా ఉండటం గమనార్హం. ఎన్నికల కోసం 3,860 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత తనిఖీలను చేపడుతోంది. ఈవీఎంల పనితీరును ముందుగానే చెక్ చేసి సిద్ధం చేయాలని, ఎన్నికల రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల అధికారులు జిల్లా అధికారులకు సూచించారు.



పారిశుధ్య కార్మికురాలిపై అత్యాచారయత్నం

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి ..

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 9 : ఓ పారిశుధ్య కార్మికురాలిపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో గురువారం చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మెడికల్ కళాశాలలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళను సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్ ఫోన్ చేసి స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న సాయి ఏజెన్సీకి రావాలని పిలిపించాడు. ఆమె అక్కడికి వచ్చి లోపలిగా వెళ్లగా వెంటనే తలుపులు మూసేసి అత్యాచారయత్నం చేశాడు. ఆయనతో వాగ్వాదానికి దిగి తప్పించుకొని బాధితురాలు బయటకు వచ్చింది. ఈ సంఘటన గురించి ఆమె తన భర్తకు తెలపడంతో పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ముందు ఆందోళన చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా మహేష్ అనే వ్యక్తి తనతో ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడినట్లు పారిశుధ్య కార్మికురాలు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మోగనున్న పెళ్లిబాజా

- రేపటి నుంచి మాఘమాసం ప్రారంభం
- రికార్డు స్థాయిలో జరుగనున్న వివాహాలు



నారాయణపేట, ఫిబ్రవరి 9: ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈనెల 11 నుంచి మాఘ మాసం ప్రారంభం కానుండటంతో అధిక సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. నిర్వాహకులు ముహూర్తాలు పెట్టుకొని, ఏర్పాట్లపై దృష్టి సారించారు. పెళ్లిళ్ల కోసం బంగారం, వెండి ఆభరణాలతో పాటు దుస్తులను కొనుగోలు చేస్తుండటంతో నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో రద్దీ నెలకొంది. ఫిబ్రవరి, మార్చితో పాటు ఏప్రిల్ 26 వరకు శుభ ముహూర్తాలు ఉండటంతో ముహూర్తాలు పెట్టుకుంటున్నారు. ఏప్రిల్ 28 తర్వాత మూఢాలతో శుభ ముహూర్తాలకు బ్రేక్ పడనుంది. వైశాఖ, జ్యేష్ఠ మాసాల్లో శుభ ముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు. ఆ తర్వాత ఆషాఢ మాసం, శూన్య మాసం ఉండటంతో శుభ కార్యాలు చేసుకోరు. అనంతరం ఆశ్వయుజ మాసం దసరా తర్వాత పెళ్లి ముహూర్తాలు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో రికార్డు స్థాయిలో వివాహాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 14న వసంత పంచమి రేవతి నక్షత్రం, 16న శుక్రవారం రథ సప్తమి భరణి నక్షత్రం, 18న ఆదివారం నవమి రోహిణి నక్షత్రం సెలవు దినాలు కావడంతో అధికంగా పెళ్లిళ్లు చేయనున్నారు. మాఘ మాసంలో రాజయోగం ఉంటుందని శుభకార్యాలు జరుపు కుంటారు. ఈ ముహూర్తాల్లో ఫంక్షన్ హాల్స్ ముందుగానే బుక్ కావడంతో అవి దొరకక ఆలయాలు, ఇంటి ముంగిట్లో, విశాలమైన స్థలాల్లో వివాహాలు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. పెళ్లిళ్ల నేపథ్యంలో పురోహితులు, వాయిద్య మేళం వారు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, డెకరేషన్ వారికి చేతినిండా పని దొరకనుంది.

శుభ ముహూర్తాలు ఇలా..

- ఫిబ్రవరి నెల మాఘ మాసంలో 11, 12, 13, 14, 16, 18, 19, 21, 22, 26, 27, 29 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. మార్చిలో 3, 4, 6న, పాల్గుణ మాసంలో 16, 17, 26, 27, 30 తేదీల్లో, ఏప్రిల్‌లో 1, 3, 4, 5, 18, 20, 21, 22, 26, 28, మేలో 1, 2 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి.

తహసీల్‌లో భూ రికార్డులు
మాయం చేసే యత్నం?

- అనుమానంతో కార్యాలయ ఉద్యోగి, మాజీ సర్పంచ్‌లను పట్టుకున్న కాంగ్రెస్ నాయకులు



అర్ధరాత్రి వేళ రికార్డులను పరిశీలిస్తున్న ఉద్యోగి హనుమంతు, మాజీ సర్పంచ్ బోడ్యనాయక్

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 9 : నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోడ్యనాయక్, కార్యాలయ ఉద్యోగి హనుమంతు నాయక్‌లు కలిసి భూ రికార్డులను తారుమారు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అజయ్ కుమార్, సంతోష్, గౌరీశంకర్, రామనాథం అక్కడికి చేరుకొని వారిని పట్టుకున్నారు. అర్ధరాత్రి ఇక్కడ మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అర్ధరాత్రి వరకు ఎలా పనిచేస్తావని ఉద్యోగిని నిలదీశారు. అనంతరం వారి నుంచి సమాచారం అందుకున్న సీఐ రవీందర్ అర్ధరాత్రి 12:10 గంటల సమయంలో అక్కడి వచ్చి అత్యవసర పనులు చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అని హనుమంతును ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. వెంటనే ఆర్ఐ కృష్ణాజిని పిలిపించి విషయం చెప్పారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ హనుమంతుతో ఫోన్లో మాట్లాడారు. అర్ధరాత్రి వేళ ఆయన కోసం పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్యులకు ఏమైనా పత్రాలు కావాలంటే నానా తిప్పలు పెడుతూ కాలయాపన చేస్తారని, బీఆర్ఎస్ నాయకుడు బోడ్యనాయక్ కోసం మాత్రం అర్ధరాత్రి వరకు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


ఎస్ఎల్‌బీసీ పరిహారం కాజేసేందుకేనా?

కార్యాలయంలో జరిగిన పరిణామాన్ని గమనిస్తే గతంలో ఎస్ఎల్‌బీసీ భూపరిహారం అందించే క్రమంలో అక్కడ భూమిలేని బోగస్ రైతులకు కూడా దాదాపు రూ. 2 కోట్లలో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని సరిదిద్దుకునే క్రమంలోనే అర్ధరాత్రి భూ రికార్డులను తారుమారు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగి నిజానిజాలను తేల్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


కారు బీభత్సం..

- మూడు బైక్‌లకు ఢీ
- ఒకరి మృతి
- వనపర్తి జిల్లా కొత్తకోటలో ఘటన

కొత్తకోట, ఫిబ్రవరి 9: వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో ఓ కారు శుక్రవారం బీభత్సం సృష్టించడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయనిపేట గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి మద్యం మత్తులో కారు నడుపుతూ పాలెం వైపు నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొత్తకోట చౌరస్తాలో రెండు బైకులను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైకులపై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రజలు భయాందోళనలకు గురై కేకలు పెట్టారు. తర్వాత కారును అలాగే ముందుకు పోనిచ్చాడు. కొందరు బైక్‌లపై వెంబడించినా కారును ఆపలేదు. పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన నరసింహ (34) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు వెనుక నుంచి ఢీకొనడంతో అతని ఓ కాలు తెగిపడి, మృతి చెందాడు. కారు బైక్‌ను ఢీకొని ముందుకు వెళ్లలేకపోవడంతో సతీష్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.







ప్రమాదమా.. హత్యా?

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 : మహబూబ్‌నగర్ సమీపంలోని కోడూరు శివారులో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే అదే గ్రామానికి చెందిన వెంకటయ్య అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్నాడు. అదే బావిలో ఆటోడ్రైవర్ రాఘవేందర్‌గౌడ్ ఉండటం ప్రమాదవశాత్తు బావిలో పడ్డారా ? లేక వెంకటయ్య హత్యకు గురయ్యాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కోడూరుకు చెందిన వెంకటయ్య(55) జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తాడు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చి రాత్రి సమయంలో గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాఘవేందర్‌గౌడ్ ఆటోలో గ్రామానికి బయలుదేరాడు. గ్రామశివారులోని బావిలో వెంకటయ్య శవమై ఉండటం, అదే బావిలోంచి రాఘవేందర్ బయటకు రావడాన్ని స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటన స్థలికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని రాత్రి 10:15 గంటల సమయంలో వెలికితీశారు. అయితే వీళ్ళిద్దరు ప్రమాదవశాత్తు బావిలో పడ్డారా? లేదంటే వెంకటయ్య హత్యకు గురయ్యాడా అన్న అను మానాలు వ్యక్తం అవుతున్నాయి.


గ్రామస్థులు మాత్రం వెంకటయ్య గొంతుపై గాయాలున్నాయని డబ్బుల కోసం హత్య చేసి బావిలో తోసి ఉంటాడనే అనుమానంతో రాఘవేందర్‌పై దాడి చేయగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ గాంధీనాయక్ తెలిపారు. కాగా ఆటోడ్రైవర్‌పై గతంలో పలు కేసులున్నాయని, పలుమార్లు జైలుకు వెళ్ళిరావడంతో అతనిపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వెల్దండ, ఫిబ్రవరి 9 : ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎండీ అబ్దుల్ ఖరీం (55) అనే వ్యక్తి ఈనెల 5న రాత్రి సమయంలో నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన నరేష్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఖరీం తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రవి తెలిపారు.

పురుగుల మందు తాగి...

వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన కోట్ల రాములు (70) అనే వృద్ధుడు పురుగులమందు తాగి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాములు గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఈనెల 6న పురుగులమందు తాగి అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. రవి తెలిపారు.







బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

- రాష్ట్రాన్ని దోచుకొని దాచుకున్న కేసీఆర్
- పాలమూరు న్యాయ పాదయాత్రలో వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్


భూత్పూర్ సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అడ్డాకుల/ భూత్పూర్, ఫిబ్రవరి 9 : గత పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై రాష్ట్రాన్ని, దేశాన్ని దోచుకున్నాయని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు న్యాయపాదయాత్ర చేపట్టిన సందర్భంగా శుక్రవారం రాత్రి భూత్పూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కీ నవీన్‌గౌడ్ అధ్యక్షతన చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డితో కలిసి వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కై లిక్కర్‌స్కాంలో ఎమ్మెల్సీ కవితను జైల్ వెళ్లనీయ కుండా అడ్డుకున్నారని, ప్రజలు అన్నీ గమనించి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అదే విధంగా వచ్చే పార్లమెంటు ఎన్నిల్లో పాలమూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీ ఇచ్చి తనను గెలపించుకో వాలని వంశీచంద్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడు తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించిన మాదిరిగానే వచ్చే పార్లమెంట్ ఎన్నిల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు ఓడిస్తారని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ఎంపీటీసీ పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ హర్యానాయక్, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం అడ్డాకు ల, మూసాపేట మండలాల్లో జరిగిన న్యాయ పాద యాత్రలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు శకుంతల, మైనార్టీసెల్ దేవరకద్ర అధ్యక్షుడు షఫిహమ్మద్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి పాల్గొన్నారు.

సిస్ నిధులు అంతేనా !

- ఉమ్మడి జిల్లాలో గత నవంబరు మూడున సిస్ పరీక్ష
- నిధులు ఉన్నా నిర్వాహకులకు అందని వైనం
- అధికారుల నిర్లక్ష్యం అంటున్న విద్యార్థులు, నోడల్ అధికారులు
- అన్ని జిల్లాలో అందినా... పాలమూరు జిల్లాల్లో అందని వైనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 9 : తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో విద్యానైపుణ్యాలను గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ తదితర పాఠశాలల్లో సిస్ (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష గత నవంబరు 3న నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి సమగ్ర శిక్షా నుంచి జిల్లా విద్యాశాఖల అధికారులకు అందుకు సరిపడా నిధులు కూడా వచ్చాయి. పరీక్షకు నిర్వహణ ప్రశ్నపత్రాలకు, నిర్వాహకుల, నోడల్ అధికారులకు ఆ నిధులు ఖర్చు చేయాలి. సమగ్ర శిక్షా రాష్ట్ర అధికారులు ఆదేశించారు. కానీ, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికి వారి సిస్ నిర్వహణ నిధులు అందలేదని పలువురు నోడల్ అధికారులు, పరీక్ష నిర్వాహకులు (ఇన్విజిలేటర్స్) కూడా నిధులు ఇవ్వలేదు. పరీక్ష నిర్వహించి మూడు నెలలు గడిచినా వారు చేసిన పనికి సంబంధించి డబ్బులు ఇవ్వకపోవడంపై నిర్వాహకులు మండిపడుతున్నారు. అధికారు మాత్రం అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని సాకు చూపుతూ దాటవేత ధోరణితో వ్యవహరిస్తూ వస్తున్నారని, ఎన్నికలు పూర్తై రెండు నెలలు అయినా ఇప్పటికీ చేసిన పనికి డబ్బులు అడిగితే ఇప్పుడు, అప్పుడు అంటూ విద్యాశాఖ అధికారు బొంకుతూ వస్తున్నారన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి వీటిని చెల్లించకుంటే ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో నిధులు వెనక్కిపోతాయని కొందరు నోడల్ అధికారులు చెపుతుంటే, మరికొందరు ఆ డబ్బులు విద్యాశాఖల నుంచి డ్రా అయ్యాయని అంటున్నారు. మొత్తంగా చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోవడంపై విద్యా శాఖ అధి కారులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నిధులు తర్వరలోనే చెల్లిస్తాం

సిస్ పరీక్షలకు సంబంధించి సమగ్రశిక్షా నుంచి నిధులు వచ్చాయి. జిల్లాలో ఇప్పటికే 130 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించిన (విద్యార్థులు) చెల్లించాం. మిగతా వారికి కూడా త్వరలోనే డబ్బులు చెల్లిస్తాం. నోడల్ అధికారులకు చెల్లించాల్సిన డబ్బులు రాలేదని, వచ్చిన వెంటనే ఇస్తాం.

- దుంకుడు శ్రీనివాస్, ఏఎంవో మహబూబ్‌నగర్

విద్యార్థుల్లో విద్యానైపుణ్యాలను గుర్తించేందుకు నవంబరు 3న ప్రాథమిక స్థాయిలో మూడవ తరగతి, ఉన్నత పాఠశాలల స్థాయిలో ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి మండలానికో నోడల్ అధికారిగా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించారు. వీరికి నిర్వహణ కోసం ఒక్కొక్కరికీ రూ. 7500 నిధులు కేటాయించారు. అదేవిధంగా పరీక్ష నిర్వహణ (ఇన్విజిలేటర్స్‌గా) ఉపాధ్యాయులను నియమించకుండా బీఎడ్, డైట్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇన్విజిలేటర్స్‌గా అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి విధులు

గత నవంబరు 3న సిస్ పరీక్ష

నిర్వహించిన నిర్వాహకులైన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.400 ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, ఇతర జిల్లాల్లో ఇన్విజిలేటర్లకు పూర్తి స్థాయి డబ్బులు ఇచ్చినా, పాలమూరు జిల్లాలో 649 మంది ఇన్విజిలేటర్లకు ఒక్కరికి రూ.400 ఇవ్వాల్సి ఉండగా కేవలం 130 మందికి మాత్రం రూ.400 ఇప్పటి వరకు చెల్లించారు. మిగతా వారికి ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదు. నోడల్ అధికారులకు ఇప్పటికీ ఒక్కరికూడా డబ్బులు చెల్లించలేదంటున్నారు. మూడు నెలల కిందట నిధులు వచ్చిన ఇప్పటికి మహబూబ్‌నగర్ జిల్లాలో చెల్లించలేదని చెపుతున్నారు. నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలో ఇన్విజిలేటర్ల అందరికీ డబ్బులు చెల్లించాం. ఎలాంటి బకాయిలు లేవని నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల విద్యాశాఖ అధికారి గోవిందరాజులు తెలిపారు.


చిన్నచింతకుంట : కురుమూర్తిస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు


గండి ఆంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


అచ్యుతాపూర్ గ్రామ శివారులోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

ఆలయాల్లో అమావాస్య పూజలు

గోపాల్‌పేట/వనపర్తి రూరల్/ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 9 : అమావాస్య సందర్భంగా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజ నేయస్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి పల్లకీసేవ నిర్వ హించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈవో రామే శ్వరశర్మ, గట్లఖానాపూర్ గ్రామ భజన బృందం, బుద్దారం భజన బృందం, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, జంప్లానాయక్, పెంటరావు, మధుకర్, యల్ల గౌడ్, డాక్టర్ రవి, జూనియర్ అసిస్టెంట్ నగేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. వనపర్తి మండలం అచ్యుతాపూర్ గ్రామ శివారులోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామికి శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశా రు. ఉదయం ఆరు గంటలకు మూలవిరాట్‌కు అభిషేకాలతో పూజలు చేశా రు. విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఎల్ఐసీ కృ ష్ణ, చంద్రకళ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రమే ష్‌శర్మ, నవీన్‌శర్మ, శివస్వామి నరేందర్, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, ఆశన్ననాయుడు, శివకుమార్, కృష్ణయ్య, మహేష్, రవి, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఘణలింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, అర్చ నలు చేస్తు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. భక్తులకు పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆల యం ఆవరణలో భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వ హించినట్లు సామాజిక కార్యకర్త కమ్మరి గోపి తెలిపారు.

కురుమూర్తిస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిన్నచింతకుంట : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలోని శ్రీ కురుమూర్తి వేంకటేశ్వరస్వామి క్షేత్రం శుక్రవారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్నారు. జాతర మైదానంలోనూ భక్తులు దాసంగాలు పెట్టారు. వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారుల సందడితో కిటకిటలాడింది. స్వామి వారిని ఆలయ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి దర్శించుకున్నారు.


గవర్నర్ తమిళిసైకి అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు అమ్మవారి ప్రతిమను అందజేస్తున్న ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, అర్చకుడు ఆనంద్‌శర్మ

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

- గవర్నర్ తమిళిసైకి ఆహ్వానపత్రిక అందించిన ఈవో

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 9 : జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య రాష్ట్ర గవర్నర్ తమిళిసైని కోరారు. హైదరాబాదులోని గవర్నర్ కార్యాలయంలో శుక్రవారం వారు ఆమెను కలిశారు. బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించారు. ప్రసాదంతో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని, ఈనెల 14న అలంపూర్‌కు రానున్నట్లు తెలిపారని ఈవో చెప్పారు.

వివాహిత అదృశ్యం

రాజోలి, ఫిబ్రవరి 9 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలికి చెందిన వివాహిత అదృశ్యం అయ్యిందని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆమె కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, ఈనెల మూడున బీపీ, షుగర్ మాత్రలే తేవాలని భర్తను కోరింది. ఆయన బయటకు వెళ్లి మందులు తీసుకొచ్చే సరికి భార్య కన్పించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ డబ్బా దగ్ధం


దగ్ధమైన డబ్బా

దేవరకద్ర, ఫిబ్రవరి 9 : షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా డబ్బా దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని నాగారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు మహ్మద్‌సాయాబ్ అనే వ్యక్తి కొన్నేళ్ల నుంచి కిరాణం డబ్బా పెట్టుకొని జీవనం గడుపుతున్నాడు. గురువారం రాత్రి తన షాప్‌ను మూసి ఇంటికి వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తుగా విద్యుత్‌షాక్ తగలడంతో దుకాణంలో ఉన్న కిరాణం సామను, కూల్ డ్రింక్స్ పూర్తిగా కాలిపోయాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 9 : సంసార విషయంలో భార్యతో గొడవపడిన ఓ మేకల కాపరి పంటపొలాల వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని దొడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దొడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య కొంత కాలంగా మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో భార్య తిరుపతమ్మతో గొడవపడి మేకలను అడవికి తీసుకువెళ్లాడు. అక్కడ ఎవరూ లేనిది చూసి పురుగుల మందు తాగి కొట్టుమిట్టాడుతుండగా అన్నం తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు చంద్రయ్యను గమనించి చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అభిషేక్ రెడ్డి తెలిపారు. భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కొనసాగుతున్న అభయుడి బ్రహ్మోత్సవాలు

- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు


పల్లకి సేవలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఊర్కొండ, ఫిబ్రవరి 9 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయం పరిసరాలు కిక్కిరిసినవి. అర్చకులు స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలు, అర్చనలు, మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రాత్రి పల్లకి సేవ చేశారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బీజేపీ నాయకులు శాంతికుమార్ అభయుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, రాజేందర్‌గౌడ్, పరశురాములు, వెంకటేష్, నరేందర్‌గౌడ్, హన్మంతు, ఆంజనేయులు, శ్రీనుసాగర్, పాలకమండలి సభ్యులు నర్సిరెడ్డి, అర్చకులు దత్తాత్రేయశర్మ ఉన్నారు.

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి శుక్రవారం అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిని, ఉద్యోగ సంఘం నాయకులు దార సుందర్, అధికారులు తదితరులు ఉన్నారు. అనంతరం పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు ప్రతి శనివారం భక్తులు సౌకర్యార్థం బస్సులు నడపాలని కోరగా సానుకూలంగా స్పందించి, పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

రేపు సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 9 : సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యో గులు అత్యవసర సమావేశం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలోని ఆదివారం అపెక్స్ సెంట్రల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కే. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాద గిరి, మమతలు శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. 11 ఉదయం 10.30 సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు హాజ రు కావాలని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, అదేవిధంగా మహబూబ్ నగర్, దేవరకద్ర, జడ్చర్ల ఎమ్మెల్యేలచే జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 9 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని ఆర్‌వీయం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఉదయం 9.30లకు పతాకావిష్కరణతో ప్రారంభానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చావా రవి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమాశానికి ఆఫీస్ బేరర్స్, జిల్లా నాయకులు పాల్గొనాలని తెలిపారు .

బైకును ఢీ కొట్టిన కారు

- ఇద్దరికి గాయాలు

జడ్చర్ల, ఫిబ్రవరి 9 : జాతీయ రహదారి జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి స్టేజీ సమీపంలో బైకును కారు ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మండలం యాశాయికుంట తండాకు చెందిన విస్లావత్ రాంజీ, బాదేపల్లి పాతబజారుకు చెందిన నర్సిములులు బైకుపై మోటార్ రిపేర్ చేయించేందుకు దివిటిపల్లి వెళ్లారు. అనంతరం వారిరువురు బైకుపై తిరిగి వస్తుండగా బురెడ్డిపల్లి స్టేజీ వద్ద హైదరాబాద్ నుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాంజీ, నర్సిములుకు గాయాలు కావడంతో చికిత్స కోసం అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. రాంజీ భార్య విస్లావత్ సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అమరవాయి వాసికి డాక్టరేట్

- డాక్టరేట్ పూర్తిచేసినందుకు శేకుంటి రవికుమార్‌ను అభినందించిన వీసీ



ప్రొఫెసర్ పద్మావతి చేతుల మీదుగా పీహెచ్‌డీ పత్రాలు అందుకుంటున్న శేకుంటి రవికుమార్

పాలమూరు యూనివర్సిటీ/ మానవపాడు, ఫిబ్రవరి 9 : గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామానికి చెందిన శేకుంటి రవికుమార్‌కు డాక్టరేట్ సాధించారు. శేకుంటి రవి కుమార్‌కు డాక్టరేట్‌గా ప్రకటిస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రి విభాగంలో ప్రొఫెసర్ డి.ఎ.పద్మావతి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు ఓయూ పరీక్షల నిర్వహణ అధికారి రవికు మార్‌కు డాక్టరేట్‌గా ప్రకటిస్తూ పత్రిక ప్రకటన జారీ చేశారు. నిరుపేద దినసరి కూలీ కుటుంబానికి చెందిన శేకుంటి శివన్న, చెన్నమ్మలకు మారుడు రవికుమార్ మానవపాడులోని జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి వరకు చదివి ఇంటర్మీడియేట్ అచ్చంపేట గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. డిగ్రీ వనపర్తిలో, పీజీ సైఫాబాద్ సైన్స్ కళాశాలలో చదివారు. 2012లో సెట్ క్వాలిఫై అయి ఆ సెట్ ద్వారా ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. 2013లో పీయూలో కాంట్రాక్ట్ పద్ధతిన నియామకమయ్యారు. పీయూలో అధ్యాపకునిగా పనిచేస్తూనే "సిథిసిస్ అండ్ డీఎఫ్‌టీ (డెన్సిటీ ఫంక్షనల్ థియరి) స్టడీస్ ఆఫ్ బయాలజీకల్లి ఆక్టివ్ బెంజథైన్స్ సల్ఫొనేట్స్ బై యూజింగ్ నావెల్ డీమాఫ్ లూయిస్ బేస్ అడక్ట్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. కేజీ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థలో చదివి యూనివర్సిటీలో అధ్యాపకునిగా పని చేసుకుంటూ డాక్టరేట్ సాధించినందుకు అటు గ్రామస్థులు, పీయూ వీసీ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కెమిస్ట్రి బీవోఎస్ ప్రొఫెసర్ అనంతలక్ష్మి, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, పీహెచ్‌డీ సహాయకులు శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో
నల్లమల యువకుడికి రజత, కాంస్య పతకాలు


మెడల్స్ అందుకుంటున్న రాందాస్

మన్ననూర్, ఫిబ్రవరి 9: హైదరాబాద్ గచ్చిబౌలిలో శుక్రవారం జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన రాందాస్ అనే యువకుడు ప్రతిభ చాటాడు. 10 కిలోమీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 5 కిలోమీటర్ల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రతిభ చాటిన రాందాస్‌కు రాష్ట్ర క్రీడా ఉన్నతాధికారులచే మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నాడు. రాందాస్‌కు బాల్యం నుంచి క్రీడలంటే ఇష్టం. ఉప్పునుంతల పోలీస్ ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే, పలు క్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తూ అనేక పతకాలు సాధించాడు. మన్ననూరు గిరిజన తండా ఖ్యాతిని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకెళుతున్న యువకుడిని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ గిరిజన విభాగం నాయకులు రాజు, తులసీరాం, రాజారాం, రమేష్ చరణ్ అభినందించారు.

రేపు ఐదవ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 9 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఈనెల 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గురుకుల సంక్షేమాధికారి ఫ్లోరెన్స్‌రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోని 28 కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 10683 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ ఉంచినట్లు తెలిపారు. ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు, ఆధార్‌కార్డు, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

పల్లికి మద్దతు ఏదీ?

- ధర లేక వేరుశనగ రైతుల ఆగమాగం
- కనీస మద్దతు ధర లేక నష్టపోతున్న రైతులు
- వేరుశనగ ధర రూ.4500 నుంచి రూ.5500 మధ్య పలుకుతున్న వైనం
- ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలని రైతుల ఆందోళన


మద్దతు ధర లేకపోవడంతో రోడ్డుపై పల్లీలు పోసి నిప్పంటించిన రైతులు (ఫైల్)



వ్యవసాయ మార్కెట్ ముందు ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 8: ఆరుగాలం కష్టపడి పంట పండించిన వేరుశనగ రైతులకు మద్దతు ధర లేక నిరాశే మిగిల్చుతున్నది. ఎన్నో ఆశలతో మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులకు మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. పల్లీలు చిన్నవిగా ఉన్నవని బాగలేవని సాకులు చెబుతూ వ్యాపారులు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో దళారులు చెప్పిన మాటే వేదంలా మారింది. పంట అమ్ముదామని మార్కెట్‌కు తీసుకువస్తే రోజు రోజుకు ధర తగ్గిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లీ రాక మొదలైన రోజుల్లో క్వింటాల్ ధర సుమారు 8వేలు పలికింది. ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్న ధీమాతో పల్లీని తీసుకొస్తే ధరలు విపరీతంగా తగ్గిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో పల్లీ గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.7000నుంచి రూ.7500 ఉండగా కనిష్ట ధర రూ. 4వేలు మాత్రమే ఉంది. మొదట వచ్చిన పల్లీ మంచి ధర పలకడంతో రైతులు అధికంగా మార్కెట్ వస్తుండడంతో ప్రస్తుతం 90శాతం మందికి కనీస ధర పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపం అనే సాకులు చెబుతూ వ్యాపారులు దారుణంగా ధరలు తగ్గించేస్తున్నారని, పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటను నేరుగా అమ్ముకునేందుకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర లేకపోవడంతో దళారులు ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తున్నారు. వేరుశనగకు కనీస మద్దతు ధర రూ.8000 ప్రకటించాలని కోరుకుంటున్నాం.

- సందీప్ యువ రైతు, మంగళికుంటపల్లి

పెట్టిన పెట్టుబడి రావడం లేదు

వేరుశనగ విత్తనాలు రూ. 13వేల పెట్టి తీసుకువచ్చి వేస్తే పండించిన పంటను అమ్మడానికి పోతే రూ. 4500 అడుగుతున్నారు. ఏం చేయాలి.. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. రూ. 7000నుంచి రూ. 8వేల ధర ఇస్తే సరిపోతుంది.

-పర్వతాలు అంకిరోనిపల్లి

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

మార్కెట్‌కు వేరుశనగను తీసుకువచ్చిన రైతులకు ధర విషయంలో ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం. నాణ్యమైన వేరుశనగకు ధర రూ.6200నుంచి రూ. 6800 మధ్య పలుతున్నది. ధర విషయంలో ఎక్కడా ఇబ్బందులు కల్గించడం లేదు.

- నర్సింహ, వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ

మీనాక్షి రైస్‌మిల్లులో

హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ విచారణ



రైస్‌మిల్లులో విచారణ చేస్తున్న అడ్వకేట్ కమిషనర్ విమల్‌కుమార్‌జైన్, అధికారులు

పాన్‌గల్, ఫిబ్రవరి 9 : మండల పరిధిలోని మహమ్మదాపూర్ గ్రామంలోని మీనాక్షి రైస్ మిల్లులో శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ విమల్‌కుమార్ జైన్ విచారణ చేపట్టారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యంలో అవకతవకలు జరిగాయని అధికారులు మిల్లు యాజమానులపై కేసు నమోదు చేశారు. తనపై రాజకీయ కక్షసాధింపులో భాగంగానే రైసు మిల్లును తనిఖీలు చేస్తూ అధికారులు, పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని మిల్లు యజమాని పరమేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను ఆదేశించడంతో శుక్రవారం గ్రామానికి చేరుకొని రైస్‌మిల్లులో ఉన్న వరి బస్తాలను లెక్కించారు. వివరాలను కోర్టుకు సమర్పించనున్నట్లు విమల్‌కుమార్ జైన్ తెలిపారు. తనిఖీలో అడ్వకేట్ శివరాం, అదనపు కలెక్టర్ తిరుపతిరావు, ఆర్డీవో పద్మావతి, పౌర సరఫరాల శాఖ అధికారులు బాలు, ఫరీదాబేగం, నందకిశోర్, వేణు, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, ఎస్సై వేణు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

» డీఈవో గోవిందరాజులు



పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 9 : ఇష్టంతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈవో గోవిందరాజులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్టుకు సంబంధించిన ప్రగతి గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షలకు సన్నద్ధమై 10/10 జీపీఏ సాధించాలన్నారు. ప్రస్తుతం పరీక్షా సమయం కాబట్టి విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు తోడుగా ఉండాలని, ప్రతీ విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యార్థులు టెన్షన్ పడొద్దని అన్నారు.

గుర్తించిన ప్రతీ ఒక్కరికి పోలియో చుక్కలు వేయాలి

» జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు

వనపర్తి వైద్య విభాగం, ఫిబ్రవరి 9 : జిల్లాలో గుర్తించిన అర్హులైన ప్రతీ ఒక్క చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో జిల్లాస్థాయి పల్స్ పోలియో వర్క్‌షాప్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల మూడున జిల్లాలో అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేస్తామన్నారు. నాలుగు, ఐదో తేదీల్లో ఇంటింటికి తిరిగి మూడో తేదీన ఇవ్వని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. అంతేకాకుండా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈనెల 20కి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పరిమళ, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, నారయ్య, చంద్రయ్య, జల్లు అశోక్, మధు, చంద్రయ్య, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే గ్రామాల ప్రగతి

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : పరిసరాల శుభ్రతతోనే గ్రామాలు ప్రగతి సాధించే అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్, మూలమల్ల గ్రామ ప్రత్యేక అధికారి రాజు పేర్కొన్నారు. పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌పాషాతో కలిసి పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధించాలని, ఇంట్లోని వ్యర్థాలను వృథాగా రోడ్లపై వేయకుండా చెత్తకుండీలోనే వేయాలని సూచించారు. అదేవిధంగా తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం తదితర పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవమ్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి జాతర ఏర్పాట్ల పరిశీలన

పెబ్బేరు, ఫిబ్రవరి 9 : ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే చౌడేశ్వరిదేవి జాతర ఏర్పాట్లను పెబ్బేరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ ఛైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు శుక్రవారం పరిశీలించారు. జాతర సందర్భంగా వాహనాలను పెబ్బేరులోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎస్సీ కాలనీ జూరాల కాల్వ వద్దకు వెళ్లేందుకు గాను తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మునిసిపల్ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌నాయుడు, బీఆర్ఎస్ నాయకుడు మేకల ఎల్లయ్య తదితరులున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉప్పరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 9 : మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రతిభ కనబరుస్తు పాఠ్యాంశాలను చక్కగా బోధించారని ఎంఈవో ఉషారాణి అన్నారు. పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే అవకాశం ఉంటుందని ఎంఈవో ఆకాంక్షించారు. డీఈవోగా దినేష్‌కార్తీక్, ఎంఈవోగా రఫీ, హెచ్‌ఎంగా అజయ్‌కుమార్ వ్యవహరించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జయశంకర్, పాఠశాల హెచ్‌ఎం నాగమణి, సీఆర్పీ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిష్కారం కోసం పోరాడుతాం

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : మునిసిపల్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని ఐఎఫ్‌టీయూ వనపర్తి జిల్లా, రాష్ట్ర నాయకుడు హనుమంతు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఇదివరకు సీఐటీయూ కార్మిక సంఘంలో ఉన్న కార్మికులు ఐఎఫ్‌టీయూ సంఘంలో చేరుతున్న సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపల్ కార్మికుల చట్టం ప్రకారం కార్మికులకు అనేక హక్కులు కల్పించాలని, వారి హక్కులు అమలు అయ్యేవరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, రాజు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

» కొత్తకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ద్విచక్ర వాహన ర్యాలీ

» చిన్నంబావి, అమరచింత మండలాల్లో కరపత్రాల పంపిణీ



కొత్తకోటలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొత్తకోట, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారదత్తం చేయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆ సంఘం నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు దుప్పటి శ్రీను, కార్యదర్శి కురుమూర్తి, అస్కనిశ్రీను, శ్రీనివాసులు, జనార్ధన్‌సాగర్, వెంకటయ్య, చంద్రాయుడు, చిన్నరాములు, ఆంజనేయులు, ఆశన్న ఉన్నారు.

● చిన్నంబావి : బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయా సంఘాల నాయకులు మండల కేంద్రంలోని ప్రతీ ఇంటికి, దుకాణానికి వెళ్లి సమ్మె కరపత్రాలను పంపిణీ చేస్తు గ్రామీణ బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీఐటీయూ మండల కన్వీనర్ వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, పుల్లన్న, సీఐటీయూ మండల నాయకులు శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● అమరచింత : ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని శుక్రవారం అమరచింత మండలం చంద్రఘడ్, చంద్రప్ప తండాలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. 16న జరిగే బంద్ కోసం 10న అమరచింతలో జరిగే వాహన ర్యాలీలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎన్.రమేష్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, కోశాధికారి వెంకటేష్, రవినాయక్, బాలునాయక్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, సమ్మెను విజయవంతం చేయాలంటూ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎల్ఐసీ రాజన్న, ప్రసాద్‌లు శుక్రవారం విడుదల చేసిన ఓ సంయుక్త ప్రకటనలో కార్మికులను కోరారు.



అమరచింతలో ఏపీఎంకు సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

ఏపీఎంకు సమ్మె నోటీస్ అందజేత

అమరచింత మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఐకేపీ, వీవోఏలు ఏపీఎం శ్రీనివాసులుకు శుక్రవారం సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐకేపీ, వీవోఏల బకాయి వేతనాలు చెల్లించాలని, సమ్మె కాలం నాటి వేతనాలు వెంటనే ఇవ్వాలని వారు కోరారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్.రమేష్, ఐకేపీ, వీవోఏ సంఘం అధ్యక్షులు రంగన్న, చంద్రకళ, మాధవి, వరలక్ష్మి, రాధ తదితరులున్నారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి

» కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మునిసిపల్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 9 : వనపర్తి పురపాలిక పరిధిలో ఇప్పటివరకు కేవలం 27 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారని, గడువులోగా వందశాతం పన్ను వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కమర్షియల్ ప్రాపర్టీలకు సంబంధించి బిల్లులు వసూలు చేయడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్‌తో కలిసి మునిసిపాలిటీలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వంద కమర్షియల్ ప్రాపర్టీలను గుర్తించి వాటిని పునఃపరిశీలన చేయాలని, ప్రతీ ప్రాపర్టీకి సంబంధించి పరిశీలిస్తున్న ఫొటోలు, వీడియోలు గ్రూపులో పెట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో మునిసిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఇందుకు మునిసిపల్ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యను తెలుసుకోవాలని, అదేవిధంగా సమస్యను పరిష్కరించడంతో పాటు, నివేదికను ఇవ్వాలని సూచించారు. తాగునీటి సరఫరాపై తాను, అదనపు కలెక్టర్ నివాస ప్రాంతాల్లో అక్కడక్కడ పర్యటించి, పరిశీలిస్తామని, సమస్యలు ఉన్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా అధికారులు వార్డుల్లో తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పునః ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అగ్రిగోల్డ్ లేఅవుట్ సంస్థకు నోటీసులు

వనపర్తి పట్టణ శివారులో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించిన అగ్రిగోల్డ్ సంస్థకు లీగల్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనపర్తిలో ఏర్పాటు చేసిన అన్ని లేఅవుట్‌లను పరిశీలించాలన్నారు. గ్రామ పంచాయతీ, మునిసిపల్ లేఅవుట్‌లలో నిబంధనల మేరకు వెంచర్‌లో పది శాతం ల్యాండ్ రిజిస్ట్రేషన్ గ్రామ పంచాయతీ లేదా మునిసిపాలిటీ పేరు చేశారా, లేదా పరిశీలించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ గట్టుయాదవ్, వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఏఈలు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పారితోషికాలను వెంటనే చెల్లించాలి

» సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్ యూనియన్ నాయకులు

వనపర్తి వైద్య విభాగం, ఫిబ్రవరి 9 : ఆశ వర్కర్లకు చెల్లించాల్సిన పెండింగ్ పారితోషికాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు బుచ్చమ్మ అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా పుట్ల ఆంజనేయులు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని అన్నారు. ఆశలతో అదనపు పనులు చేయించొద్దని, అదనపు పనులకు అదనపు పారితోషికం ఇవ్వాలన్నారు. సమ్మె సందర్భంగా అక్టోబర్ తొమ్మిదో తేదీన అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశలకు పారితోషికం రూ.18వేలు నిర్ణయించి ఇవ్వాలని, పీఆర్సీ, ఏరియర్స్ చెల్లించడంతో పాటు, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ఆశలకు వర్తింపజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునిత, బొబ్బిలి నిక్సన్, సూర్యవంశం రాము, నందిమల్ల రాములు, యూనియన్ నాయకురాలు భాగ్య, ఇందిర, శ్యామల, జ్యోతి, లక్ష్మీదేవి, సుజాత, లావణ్య, రేణుక, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

» అదనపు కలెక్టర్ తిరుపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 9 : తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష (ఐదవ టీజీ సెట్-2024)ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పరీక్ష ఏర్పాట్లపై 11 సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్‌లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11 ఆదివారం నిర్వహించే గురుకుల ప్రవేశ పరీక్ష(టీజీ సెట్-2024) పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల్ని పరీక్ష కేంద్రాలకు పోలీస్ ఎస్కార్ట్ సాయంతో తీసుకెళ్లాలన్నారు పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. ఇన్విజిలేటర్లకు ముందస్తుగా శిక్షణ ఇవ్వాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రయాణంలో ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పరీక్షకు 3,777 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఆర్‌సి విద్యుల్లత, డీసీవో రవీందర్, 11 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీస్, విద్యుత్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు

» అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) సంచిత్ గంగ్వార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 9 : వచ్చే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో, మునిసిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ అధికారులతో వేసవిలో తాగునీటి సమస్య మహాలక్ష్మి పథకం ఆన్‌లైన్ అప్‌లోడ్, ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలపై వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. హాబిటేషన్ వారీగా తాగునీటి డిమాండ్ ఎంత, సప్లయ్ ఎంత ఉందో రికార్డు చేయాలని సూచించారు. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకుంటే స్థానిక బోర్లు లేదా ఇతర వసతుల నుంచి ఏవిధంగా నీరు సరఫరా చేయొచ్చు అనేది ప్రణాళిక చేసుకోవాలని తెలిపారు. ఈనెల 15వ తేదీన ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలో మత్తు పదార్థాలు, గుట్కా తదితర దుష్ప్రరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో సురేష్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్ రెడ్డి, ఈఈ మేఘారెడ్డి, డీఆర్‌డీవో పీడీ నర్సింహులు, మునిసిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 9 : దేశంలోని మహిళల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న అన్నారు. గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని దళితవాడ, ముదిరాజ్ కాలనీల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గత పదేళ్లలో మహిళాభివృద్ధికి మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. అదేవిధంగా, రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, గరీబ్ కళ్యాణ్ యోజన పథకంతో పేద ప్రజలకు ఉచిత బియ్యం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, నాయకులు శివశంకర్, గోపి, విక్రమ్, వెంకటరమణ, పురుషోత్తం, రాజు, శివ, బండారి రాజు తదితరులు పాల్గొన్నారు.

● రేవల్లి : గావ్ చలో కార్యక్రమంలో భాగంగా రేవల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం పర్యటించారు. పార్టీ గ్రామ బూత్ అధ్యక్షుడు లింగస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పెబ్బేటి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌ను, డ్యూటీ నర్సులను, హాస్పిటల్‌కు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వసతులు, రావల్సిన సిబ్బంది, అందుబాటులో ఉన్న మందులు, రక్త పరీక్షల గురించి అడిగారు. ఆయాలకు జీతాలు రావడం లేదని తెలుసుకున్న ఆయన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో వంటలు చేసే వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌తో మాట్లాడి పాఠశాలలో గత వసతులపై చర్చించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, మహిళా సంఘం భవనాన్ని పరిశీలించారు. గ్రామంలో గల సర్పంచులను, పెద్ద మనుషులను, యువకులను కలిసి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్, ఉగ్గు మల్లేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పరుశురాం, బ్రహ్మంచారి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రాము, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఖిల్లాఘణపురంలో బీజేపీ పథకాల విజయాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు



రేవల్లిలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నేడు డ్యాన్స్ కాంపిటీషన్

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 9 : చౌడేశ్వరిదేవి జాతర సందర్భంగా పెబ్బేరులోని మూన్‌వాక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జడ్పీహెచ్ఎస్ బాలురలో డ్యాన్స్ కాంపిటీషన్ నిర్వహించనున్నామని నిర్వాహకులు, మూన్‌వాక్ స్టూడియో యజమాని నవీన్ మాస్టర్ తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని డ్యాన్స్ కళాకారులను కోరారు. విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, షీల్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

భారతరత్న అవార్డులపై మాజీ మంత్రి హర్షం

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 9 : డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావులకు భారతరత్న అవార్డులు రావడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ బతికుండగానే 2023 నవంబరు ఎనిమిదో తేదీన అవార్డు అందించాల్సిందని, అప్పుడు ఆయనతో పాటు వ్యవసాయ రంగ నిపుణులు, అభిమానులు అందరూ సంతోషించేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

» రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ సయ్యద్ కలాం పాషా

వనపర్తి వైద్య విభాగం, ఫిబ్రవరి 9 : రక్తదానం చేయడం అంటే ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడమేనని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ సయ్యద్ కలాం పాష అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల రక్తనిధి కేంద్రంలో పట్టణానికి చెందిన యువకులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ప్రభాకర్, రెడ్‌క్రాస్ సభ్యులు గోనూరు యాదగిరి, రాజేందర్‌కుమార్, రక్తనిధి కేంద్ర సిబ్బంది లక్ష్మిపతి, వాకిటి రమేష్, తిరుపతయ్య, కార్తీక్ ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 9 : ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ తూడుకుర్తి వారి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో దాదాపు 250 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 35 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంధం రంగస్వామి, అధ్యాపకుడు కేతావత్ దశరథ్‌నాయక్, వైద్య బృందం రాజు, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట, ఫిబ్రవరి 9 : మండలంలోని కానాయపల్లి, నిర్వేన్, పాలెం, కొత్తకోట గ్రామాల సరిహద్దులోని వెంకటగిరి కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని భూదేవి, లక్ష్మీ సమ్మేతుడైన వేంకటేశ్వరస్వామి మాస కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పూజారి మురళీకృష్ణ వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీసేవలో ఊరేగించారు.

జడ్పీహెచ్ఎస్‌లో పారిశుధ్య వారోత్సవాలు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 9 : పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌ను పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్‌రాజు, ఉపాధ్యాయులు రాందేవ్‌రెడ్డి, హమీద్, గణపతి, శేషయ్య, ధర్మరాజు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పాఠశాలను శుభ్రపర్చినందుకు ఉపాధ్యాయులు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

సిలిండర్ పంపిణీకి దరఖాస్తుల పరిశీలన

కొత్తకోట/ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం అమలు చేయనున్న రూ.500 సిలిండరు పథకం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం కొత్తకోటలో శుక్రవారం చేపట్టారు. వార్డుల వారీగా దరఖాస్తులను పరిశీలిస్తూ గ్యాస్ కనెక్షన్ నంబరును దరఖాస్తుదారుల నుంచి స్వీకరిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందే రూ.500లకు సిలిండరు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోన్నది. అందుబాటులో లేని వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. అదేవిధంగా, ఆత్మకూరు పట్టణంలోని పలు కాలనీల్లో అధికారులు వంట గ్యాస్ పంపిణీ దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు.

గృహజ్యోతికి దరఖాస్తుల స్వీకరణ

వీపనగండ్ల, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకానికి గాను మండల కేంద్రంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏఈ భగవంతుడు తెలిపారు. విద్యుత్ ఇంటి మీటర్ నెంబర్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తు రశీదు, ఫోన్ నెంబర్లను తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లైన్‌మెన్ భాస్కర్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ నాస్తిక మేళాకు తరలిన నాస్తికులు

అమరచింత, ఫిబ్రవరి 9 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో ఈనెల 10, 11వ తేదీల్లో జరిగే 32వ జాతీయ నాస్తిక మేళాకు అమరచింత మండలం నుంచి నాస్తికులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం వనపర్తి జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో దేవుడనే భావనతో ప్రజలు మూఢనమ్మకాల్లో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలోని చార్వాక ఆశ్రమంలో జరిగే ఈ మేళాలో ప్రొఫెసర్లు, మేధావుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. మూఢనమ్మకాలపై ఇంద్రజాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. గుంటూరుకు తరలిన వారిలో యాకోబు, రాబర్ట్, కుతుబ్‌తో పాటు పలువురు ఉన్నారు.